# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సార్వత్రిక ఎన్నికల అభ్యర్థుల ఆర్థిక లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా బ్యాంకింగ్ అధికారులను ఆదేశించారు.
- ❖ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ను రేపు కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.
- ❖ విశాఖలో పచ్చదనం పరిరక్షణలో బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తున్నామని విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ అంగముత్తు అన్నారు.
- ❖ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అధికారులు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపడుతున్నారు.

===============================

సార్వత్రిక ఎన్నికల అభ్యర్థుల ఆర్థిక లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా బ్యాంకింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఈరోజు బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభ్యర్థుల వ్యయాలకు సంబంధించి ప్రత్యేకించి బ్యాంకు లావాదేవీల వ్యవహారాన్ని కచ్చితంగా తెలియజేయాల్సిందిగా ఆదేశించారు. ఒక్క రోజులో 10 లక్షలు రూపాయలు, నెల రోజుల వ్యవధిలో 50 లక్షల రూపాయల కంటే ఎక్కువ లావాదేవీలు జరిగితే, ఆ వివరాలను సమర్పించాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ఈసీకి, ఆదాయపు పన్ను శాఖకు ఇవ్వాల్సిన సమాచారం, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం అమలు చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. సోదాల్లో దొరికిన డబ్బు, ఎన్ ఫోర్సుమెంట్ ఏజెన్సీలు పర్యవేక్షించాల్సిన అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

===============================

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ను రేపు కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. రేపు మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో ఎన్నికల షెడ్యూల్ ను ప్రకటిస్తామని ఈ మేరకు వెల్లడించింది. లోక్ సభ ఎన్నికలతో పాటు

ఆంధ్రప్రదేశ్, సిక్కిం, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు ఏకకాలంలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ ను రేపు ఎన్నికల సంఘం అధికారికంగా వెల్లడించనుంది.

==============================

విశాఖ నగరం పచ్చదనం పరిరక్షణలో బాధ్యతాయుతమైన పాత్రపోషిస్తున్నామని విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ అంగముత్తు అన్నారు. విశాఖ పోర్ట్ లోకి ప్రవేసించే మార్గాల్లో ఒకటైన పురాతన సీహార్స్ జంక్షన్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లిఖార్జున, జివిఎంసీ అదనపు కమిషనర్ కే.ఎస్.విశ్వనాధన్ తో కలిసి ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో పచ్చదనం కోసం 5.6 లక్షల మొక్కలను పెంచుతున్నామని, మరో లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే భీమిలిపట్నం నుంచి తీరం వెంబడి సముద్రం కోతకు గురికాకుండా మడ అడవుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన పేర్కొంటూ.....

(వాయిస్ 22 సెకన్లు)

==============================

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో 'ఓటు హక్కు' పై అవగాహన కల్పించేందుకు ఈరోజు జిల్లా కలెక్టర్ విజయ సునీత ఆధ్వర్యంలో దివ్యాంగులతో ర్యాలీని నిర్వహించారు. ఓటు విలువను తెలుపుతూ, అందరూ ఓటింగ్‌లో పాల్గొనాలని, ప్రజాస్వామ్య సౌధాన్ని నిర్మించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటర్లను చైతన్యపరిచే చేసే ఉద్దేశ్యంతో వివిధ రకాల అవగాహనా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఇటీవల ఓటుహక్కు పొందిన యువ ఓటర్లను ఉత్సాహపరిచే కార్యక్రమంలో భాగంగా ఈ మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించినట్లు వెల్లడించారు.

విరామం

==============================

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన 'మేరా పెహలా ఓట్ దేశ్‌కే లీయే' కార్యక్రమాం కింద విజయనగరం జిల్లాలోని వివిధ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అదే విధంగా కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువత మొదటి సారి ఓటు వేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా దేశ భవితను మార్చే అవకాశం ఓటుతోనే ఉందని జిల్లాకు చెందిన యువ ఓటర్ సాయి కుమార్ 'ఆకాశవాణి' కి వివరించారు.

(వాయిస్ 10 సెకన్లు)

రాజ్యాంగం తమకు కల్పించిన హక్కును వినియోగించుకుంటామని వి.జ్యోతి తెలుపుతూ....

(వాయిస్ 8 సెకన్లు)

==============================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించడానికి రిటర్నింగ్ అధికారులు, డిఎస్పీలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణ్ ఆదేశించారు. కలెక్టరేట్ లో వివిధ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులతో ఎన్నికల నిర్వహణ పై సమన్వయ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, కేంద్ర ఎన్నికల సంఘం నియమనిబంధనలను పాటించాలని సూచించారు.

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి విజయనగరం జిల్లాలో పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ నిర్వహించే లెండి ఇంజనీరింగ్ కళాశాలలో భద్రత ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక ఈ రోజు పరిశీలించారు. గదులను క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులకు భద్రతాపరమైన పలు సూచనలు చేశారు.

================================

సమాజంలోని వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని శ్రీ సత్యసాయి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఈరోజు పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వినియోగదారుల వ్యవహారాలు, హక్కులను పరిరక్షించుకోగలిగే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా వినియోగదారులను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం "వినియోగదారుల కోసం న్యాయమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు" అనే అంశాన్ని ఇతివృత్తంగా తీసుకున్నట్లు వెల్లడించారు.

================================

ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికిలోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని వైఎస్సార్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సిద్ధార్థ్ కౌశల్ పిలుపునిచ్చారు. ఈరోజు జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. ఎవరైనా ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

================================

ఈ నెల 17న జరిగే గ్రూప్ 1 స్క్రీనింగ్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని విజయనగరం జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఈరోజు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహించేటప్పుడు పాటించాల్సిన నిబంధనలు, ఆయా అధికారుల విధులు, బాధ్యతలను వివరించారు. జిల్లాలో 14 కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 6 వేల 568 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు.

ఇక తూర్పుగోదావరి జిల్లాలో 25 కేంద్రాల్లో జరగనున్న ఏపిపిఎస్సి గ్రూప్-1 పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఏపిపి ఎస్సి నోడల్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ అన్నారు.

================================

దేశంలోని కోటి నివాస గృహాల్లో సౌర విద్యుత్ వెలుగులు నింపే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం “పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన” పథకాన్ని ప్రారంభించిందని సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఎస్.ఈ. కె.వి.జి.సత్యనారాయణ తెలిపారు. ఈరోజు ఒంగోలులో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 75 వేల కోట్ల రూపాయల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు.

================================
================================